క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం:మండలంలోని సబ్బవరం,అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని 33/11 కేవీ,రాంపురం నుంచి సబ్బవరం 33 కేవీ ఫీడర్‌లో ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్ వర్క్స్‌లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, నునపర్తి పంచాయతీల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం రెండో దశ అభ్యర్థుల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు నేరుగా కళాశాలకు చేరుకొని వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. శుక్రవారం నుంచి కళాశాలల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని కంచరపాలేనికి చెందిన ఎ.కనకరత్నం కుటుంబ సభ్యులు లక్షా 116 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై దాతకు బాండ్‌ను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాలికల సంక్షేమంపై ఆరా


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏవీ శేషమ్మ

తగరపువలస: మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో భీమిలిలో నిర్వహిస్తున్న బాలసదన్‌ను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏవీ శేషమ్మ, భీమిలి జూనియర్ సివిల్ న్యాయస్థానం మెజిస్ట్రేట్ పి.నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులతో పాటు చిన్నారులతో మాట్లాడారు. బాలికల సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల హక్కులు, చట్టాల గురించి వివరించారు.

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం

సీతమ్మధార: పేరు, ఊరు పేరు చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్న యువతిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని ఒక యువతిని గుర్తించిన వ్యక్తులు ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ-ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి గురువారం తరలించారు. గతంలో కూడా ఈమెకు ఇక్కడ ఆశ్రయం కల్పించగా.. పారిపోయిందని నిర్వాహకులు తెలిపారు. ఈమె ఇతరులను దుర్భాషలాడుతోందని.. కొన్ని రోజులు యువతి పరిస్థితి గమనించి చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలిస్తామని ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

తీరం.. ఘోరం


తిక్కవానిపాలెం తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

- ముత్యాలమ్మ పాలెం , తిక్కవాని పాలెం బీచ్‌ల్లో సౌకర్యాలు శూన్యం
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు
- పట్టించుకోని పాలకులు


సువిశాలమైన తిక్కవానిపాలెం తీరం

పరవాడ : ముత్యాలమ్మ, తిక్కవానిపాలెం తీరప్రాంతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే వీటి అభివృద్ధిని, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం సీతకన్ను వేసింది. తీర ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. బీచ్‌ల్లో కనీస వసతులు లేక రాకపోకలు సాగించే పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం పర్యాటకులు తాకిడి ఉండే ఈ తీర ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

- ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యాటకులు సేదదీరడానికి బల్లలు లేక ఇబ్బందులు పడుతున్నారు.
- తాగడానికి మంచినీటి సౌకర్యాలు లేవు. తీరంలో ఉన్న మంచినీటి కొళాయి మరమ్మతులకు గురైంది.
- తీరంలో నిలువ నీడ లేక వేసవిలో పర్యాటకులు ఎండ వేడిమితో అల్లాడిపోతున్నారు.
- కార్తీకమాసంలో వనభోజనాలు చేయడానికి వచ్చే సందర్శకులు వంటవార్పులు చేసుకొనే సదుపాయం లేక ఇబ్బంది పడే పరిస్థితి ఉంది.
- తీరంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల స్తంభాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించడం వల్ల తీరంలో అంధకారం రాజ్యమేలుతుంది.
- తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే మహిళలు కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఎలాంటి మరుగు దొడ్లు లేవు.


ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యాటకుల ఆట పాటలకు మిగిలింది ఈ స్థలమే


బీటలు వారిన సిమెంటు గొడుగుల ప్లాట్‌ఫారం


అధ్వానంగా సిమెంటు గొడుగులు

- తీరం సమీపంలోని స్థలాలు పరుల పాలవుతుండడం వలన పర్యాటకుల ఆటపాటలకు అవసరమైన క్రీడా స్థలం లేకుండా పోతోంది. ఉన్న కొద్ది పాటి స్థలంలోనే ప్రస్తుతం కాలక్షేపం చేస్తున్నారు.
- తిక్కవానిపాలెం బీచ్ విషయానికొస్తే ఎన్టీపీసీ సముద్రంపై నిర్మించిన అతి పొడవైన జెట్టీ ఈ బీచ్‌కు ప్రత్యేక ఆకర్షణ. తీరంలో ఎన్టీపీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన సిమెంటు గొడుగులు కొంత మేర పర్యాటకులను ఆదుకొంటున్నాయి. వాటి ఆలనా పాలన చూసే నాథుడు లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.
- పర్యాటకులు వేడుకలు జరుపుకొనేందుకు ఇక్కడ ఎలాంటి వసతి సదుపాయాలు లేక వంతెన కింద వంట వార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

కనీస సదుపాయాలు కల్పించాలి



తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో తాగునీటి సదుపాయంతో పాటు సేదదీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. మహిళల కోసం మరుగుదొడ్లు, ఎండావానల నుంచి రక్షణ కల్పించడానికి షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ఎన్టీపీసీ నిర్మించిన సిమెంటు గొడుగులకు మరమ్మతులు చేపట్టాలి.

– పి.చంద్రశేఖర్, వెన్నలపాలెం

పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలి



తీర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలను అరికట్టడానికి పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయాలి. ప్రతీ ఆదివారం తీరంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. తీరంలో విద్యుత్ సదుపాయాన్ని పునరుద్ధరించాలి. ప్రమాదాలను అరికట్టడానికి గజఈతగాళ్లను నియమించాలి.

– సమ్మెంగ లోవరాజు, సమ్మెంగపాలెం

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా


గొల్లలపాలెంలో జగనన్న కాలనీ ఇళ్లను ఆనుకుని గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన ప్రదేశం


సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన పొక్లెయిన్, లారీలు

- జగనన్న కాలనీని ఆనుకుని తవ్వకాలు
- ఫిర్యాదుతో దాడి చేసిన అధికారులు
- పొక్లెయిన్, లారీలు సీజ్

సబ్బవరం: మండలంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. పలు చోట్ల ప్రభుత్వ భూములు, ప్రైవేటు లే అవుట్‌లలో రాత్రికి రాత్రే పెద్ద ఎత్తున తవ్వకాలు చేపడుతూ గ్రావెల్ తరలించుకుపోతున్నారు. మైనింగ్,రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పరిస్థితులు మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు దెబ్బతినేలా.. ప్రకృతి వనరులకు విఘాతం కలిగినా కాసులకు మరిగి తవ్వకాలు చేస్తున్నారు. ఫిర్యాదులు చేయడంతో అక్కడక్కడ దాడులు చేసి అధికారులు వాహనాలను సీజ్ చేస్తున్నారు. అయినా అక్రమార్కులు తగ్గడం లేదు.

గ్రామస్తుల ఫిర్యాదుతో..

మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో గురువారం వేకువజామున అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న పొక్లెయిన్‌తో రెండు లారీలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వీఆర్వో శేష మిగిలిన సిబ్బంది కలిసి దాడి చేసి వాహనాలను పోలీస్‌లకు అప్పగించారు. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 293లో జగనన్న అర్బన్ హౌసింగ్ మెగాలే అవుట్‌లోని ఆర్‌సీసీ ప్లాట్‌లు,అర్బన్ హౌసింగ్ సెంట్ ప్లాట్‌లలో తవ్వకాలు చేపట్టి గ్రావెల్ తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పాటు ఈ లే అవుట్‌కు సమీపంలోని ప్రైవేటు లే అవుట్‌లలో కూడా తవ్వకాలు చేపట్టి గ్రావెల్ తరలించుకుపోతున్నట్లు రెవన్యూ అధికారులు తెలిపారు. పట్టు బడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు.

విశేషంగా స్వర్ణపుష్పార్చన


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పఠిస్తూ స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస హోమం, సుదర్శన హోమం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎంఎస్ రాజు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కార్మికులపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలి

- మహాధర్నాలో స్టీల్ ప్లాంట్ కార్మిక నాయకుల డిమాండ్


ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముందు ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం బలవంతపు ఆర్థిక ఆంక్షలు ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతకాని వైఖరి వల్ల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నారన్నారు. ముడి పదార్థాలు సమకూర్చలేని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం సిగ్గుచేటన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే ప్లాంట్ మనుగడ సాధిస్తుందన్నారు. అదే విధంగా నిర్వాసితుల ఉపాధి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వేతనాలు పెంచకపోగా.. కోతలా!

సెయిల్‌తో సమానంగా వేతన సవరణ జరగాల్సి ఉండగా ఇక్కడ ఉన్న వేతనాలపై ఆంక్షలు విధించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు యాజమాన్యం ప్రతీ నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ఆర్థిక ఆంక్షల ప్రతిపాదనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లోకి నాయకులు వెళ్లకుండా పెద్ద ఎత్తున పోలీసు సిబ్బందిని మోహరించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ధర్నాలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, జె్రిపోతుల ముత్యాలు, ఎన్. రామారావు, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, డి.వి. రమణారెడ్డి, సురేష్ బాబు, పరంధామయ్య, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ.. చల్లగ చూడమ్మా


పూజలందుకున్న బంగారమ్మతల్లి

పెందుర్తి: పినగాడిలో కొలువుదీరిన బంగారమ్మతల్లి వార్షిక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. పసుపు,కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, గ్రామపెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇద్దరి అదృశ్యంపై కేసు నమోదు


యాండ్రపు సత్య


రమణమూర్తి

పెందుర్తి: మండలంలో మహిళ, వృద్ధుడు అదృశ్యంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. పెందుర్తిలోని రాడివారి కళ్లాలు జనచైతన్య లే అవుట్ సమీపంలో నివాసం ఉంటున్న యాండ్రపు సత్య (26) అదృశ్యమైనట్లు ఆమె భర్త జగదీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాలు..ఆర్థిక సమస్యల కారణంగా గత నెల 13 తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అచూకీ లభించలేదన్నారు. చాలా అప్పులు చేసి తిరిగి చెల్లించలేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భర్త ఫోన్‌కు వాట్సప్ సందేశం పంపినట్టు పోలీసులు తెలిపారు.

ఓల్డేజ్ హోమ్ నుంచి..

అదేవిధంగా పెందుర్తిలోని రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో లయోలా ఓల్డేజ్ హోమ్‌లో ఉంటున్న రౌతు రమణమూర్తి (64) అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందింది. ఈ నెల 13 తేదీన ఉదయం 5.30 ప్రాంతంలో ఓల్డేజ్ హోమ్ నుంచి రమణమూర్తి వెళ్లిపోయినట్లు నిర్వాహకుడు ప్రభాకరరావు ఫిర్యాదు చేశారన్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు ఈ నంబర్లలలో 0891-2764233, 9440796039 తెలియజేయాలని పోలీసులు కోరారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి


నిరసన తెలుపుతున్న బ్యాంక్ మహిళా ఉద్యోగులు

డాబాగార్డెన్స్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, మహిళల భద్రతకు తక్షణం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భయ చట్టం ఉన్నప్పటికీ మహిళలపై ఇటువంటి దాడులు జరగడం హేయనీయమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో మహిళలపై దాడులు నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సంఘం నాయకులు కమలాకర్, ఆదారి శ్రీను, రమేష్, ఈశ్వర్, ప్రసాద్, సుజాత, ప్రత్యూష, ప్రసన్న లక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం

పాపా హోమ్ చిన్నారులతో సివిల్స్ ర్యాంకర్ పూసపాటి సాహితి


సివిల్స్ 24వ ర్యాంకర్ సాహితిని సత్కరిస్తున్న పాపా హోమ్ కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: సివిల్స్ ఐఎఫ్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించిన పూసపాటి సాహితి గురువారం పాపా హోమ్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్లి బంగారు భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇతర విషయాలు పక్కన పెట్టి కష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు చేరుకోగలరని సూచించారు. పాపా హోమ్ విద్యార్థుల కోసం రూ.10 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సాహితి అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు సంబంధించి ఏ విషయంలోనైనా తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సాహితీని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పాపా హోం ఉపాధ్యక్షుడు పంపాన వేంకటేశ్వరరావు, కార్యదర్శి వి.ఎస్.ప్రకాశరావు, సభ్యుడు పి.భాస్కర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకం

మల్కాపురం : పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం హెచ్‌పీసీఎల్‌లోని ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ స్కూళ్లకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన కొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా భూగర్భ జలాల రక్షణకు కాలుష్యరహిత వాతావరణానికి మొక్కలు విరివిగా నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరాన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


జోడుగుళ్లపాలెం తీరంలో వ్యక్తి మృతదేహం

బీచ్‌రోడ్డు: జోడుగుళ్లపాలెం సాగర తీరం వద్ద గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఆరిలోవ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 50 ఏళ్ల వయసు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు.

గ్రంథాలయాలతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

సీతమ్మధార: విశాఖపట్నం అభివృద్ధిలో గ్రంథాలయాలూ ముఖ్యమేనని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు. ఇక్కడికి ఎన్నిసార్లు వెళ్తే అన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత గ్రంథాలయానికి వెళ్లడం మానేయడం సరికాదని హితవు పలికారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పాత పేపర్లు సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని సూచించారు. పౌర గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు, మంచి సదుపాయాలున్నాయని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.